సాక్షి అనకాపల్లి

బుధవారం । 28 । మే । 2025



అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది.

ఉష్ణోగ్రతలు

మంగళవారం

	గరిష్టం/కనిష్టం
అనకాపల్లి :	35.8/25.2

రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండి, ఒక మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం తెలిపారు.



రైలు వేళల్లో మార్పులు 8లో

విశాఖపట్నం–గుణుపూర్ పాసింజర్ వేళలు జూన్ 1వ తేదీ నుంచి మారుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

న్యూస్‌రీల్


సహజంగా మగ్గిన మామిడి పండ్లనే విక్రయించాలి



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జేసీ సత్యనారాయణరావు

తుమ్మపాల: సహజ పద్ధతిలో మగ్గబెట్టిన మామిడి పండ్లను మాత్రమే విక్రయించేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఉద్యాన శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పండ్లను మగ్గబెట్టే సురక్షిత విధానాలపై రైతులకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. హాని కలిగించే రసాయనాలతో మగ్గబెట్టే విధానాన్ని పూర్తిగా అరికట్టాలన్నారు. మామిడిని మగ్గబెట్టేందుకు కాల్షియం కార్బైడ్ వినియోగిస్తే తీసుకునే చర్యల గురించి తెలియజేయాలన్నారు. ఆహార భద్రత శాఖ సిబ్బంది ఇప్పటి వరకు 26 శాంపిల్స్ సేకరించారని, ఆహార ప్రయోగశాల నివేదిక అందిన తర్వాత కార్బైడ్ వినియోగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్బైడ్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను జిల్లా పంచాయతీ శాఖ, మున్సిపల్ సిబ్బంది చిరు వ్యాపారులకు తెలియజేయాలన్నారు. మామిడి పండ్లు రవాణా చేసే వాహనాలను రవాణా శాఖాధికారులు తనిఖీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ, మార్కెటింగ్, మున్సిపాలిటీ, మెడికల్, హెల్త్, పంచాయతీ, హార్టికల్చర్, ట్రాన్స్‌పోర్ట్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మోడల్ ఎంట్రన్స్ టెస్ట్‌లు ఎంతో ఉపయోగకరం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్జేడీ, డీఈవో

విశాఖ విద్య: పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు మోడల్ ఎంట్రన్స్ టెస్ట్‌లు ఎంతో ఉపయోగకరమని విద్యాశాఖ ఆర్జేడీ బీ. విజయ భాస్కర్ అన్నారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో జూన్ 1న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న మోడల్ డీఎస్సీ పరీక్షలకు సంబంధించిన కరపత్రాలను డీఈవో ప్రేమ్‌కుమార్‌తో కలిసి ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మెగా డీఎస్సీకి సిద్ధమయ్యే అభ్యర్థులందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎటువంటి ఒత్తిడి లేకుండా పోటీ పరీక్షలను ఎదుర్కొనేందుకు ఇలాంటి మోడల్ టెస్ట్‌లు ఉపయోగపడతాయని డీఈవో ప్రేమ్ కుమార్ తెలిపారు. గోపాలపట్నం జెడ్పీహెచ్ఎస్, అనకాపల్లి ఎంజీహెచ్ఎస్, నర్సీపట్నం జెడ్పీహెచ్ఎస్, అలాగే పాడేరులో మోడల్ పరీక్షల కోసం కేంద్రాలు ఏర్పాటు చేశామని పీఆర్‌టీయూ అనకాపల్లి, విశాఖ జిల్లాల అధ్యక్షులు డి. గోపీనాథ్, ఎం. శ్రీను తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ హోంగార్డుకు ఆర్థికసాయం



పూర్వ హోంగార్డు బ్రహ్మరాజుకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి : అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఏపీఎస్ఈబీ సీలేరు శాఖలో డిప్యూటేషన్‌పై హోంగార్డుగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన కె.బ్రహ్మరాజుకు రెండు జిల్లాల్లో హోంగార్డుల ఒకరోజు వేతనం రూ.4,07,965 చెక్కును ఎస్పీ తుహిన్ సిన్హా తన కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హోంగార్డు బ్రహ్మరాజు తన విధులను బాధ్యతాయుతంగా సమర్థంగా నిర్వర్తించారని, ఆయన సేవలు ప్రశంసనీయమని అన్నారు. హోంగార్డుల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని, విధి నిర్వహణలో మరణించినా లేదా పదవీ విరమణ పొందిన హోంగార్డులకు ఆర్థిక సహాయం అందించేందుకు, ఈ రెండు జిల్లాల్లో హోంగార్డులు స్వచ్ఛందంగా ఒక రోజు డ్యూటీ అలవెన్స్‌ను విరాళంగా అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయం సూపరింటెండెంట్ ప్రతాప్ శేషయ్య, జూనియర్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

- అధికారుల తీరుపై సన్నగిల్లుతున్న ఆశలు
- కళ్ల ముందే రూ.కోట్ల విలువ చేసే ప్రకృతి సంపద తరలింపు
- పీజీఆర్ఎస్‌లో మాజీ ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
- గిరిజనుల కష్టాలు పట్టని అధికారులు
- సాగు హక్కు పట్టాలపై స్పీకర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు



నర్సీపట్నంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ విజయ కృష్ణన్‌కు ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ (ఫైల్)



బమ్మిడికలొద్దులో ఆగని లేటరైట్ తవ్వకాలు

అర్జీల గతి ఇంతేనా!

అక్రమాలు కనిపించవు... గోడు వినిపించదు...!!

నాతవరం : అక్రమాలు చూడం...జనం గోడు వినం ...సమస్యలపై మాట్లాడం... అన్నట్టుగా ఉంది అధికారుల శైలి. గిరిజన ప్రాంతంలో జరుగుతున్న లేటరైట్ **అక్రమ తవ్వకాలపై, గిరిజన సమస్యలపై** స్వయంగా **కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించక** పోవడంపై అధికారులపై ఉన్న నమ్మకం ప్రజల్లో సన్నగిల్లుతోంది. నాతవరం మండలంలో సుందరకోట పంచాయతీ శివారు బమ్మిడికలొద్దు గ్రామంలో లేటరైట్ తవ్వకాలు కూటమి పెద్దలు కనుసన్నల్లో జరుగుతోంది. ఇక్కడ లేటరైట్ తవ్వకాలు చేయడం వలన ఈ ప్రాంత గిరిజనులకు జరుగుతున్న ఇబ్బందులపై గత నెలలో నర్సీపట్నంలో కలెక్టర్ విజయ కృష్ణన్ నిర్వహించిన పీజీఆర్ఎస్ వేదికలో స్వయంగా మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఇచ్చిన ఫిర్యాదుపై నేటి వరకు ఎలాంటి స్పందన లేదు, నిబంధనలు ఉల్లంఘించి కళ్ల ముందే కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రకృతి సంపద కూటమి పెద్దలు కన్నుసన్నల్లో తరలించుకుపోతుంటే అధికారులు పట్టనట్టుగా ఉండిపోయారు. కనీసం అక్కడ ఏం జరుగుతుందో క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు ఏ అధికారి వెళ్లిన దాఖలాలు లేవు. గిరిజనుల డిమాండ్ మేరకు మరలా ఈనెల 26వ తేదీన మాజీ ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ గిరిజన పెద్దలతో కలిసి అనకాపల్లి పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు లేటరైట్ అక్రమ తవ్వకాలపై స్వయంగా ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఇచ్చిన ఫిర్యాదుకే దిక్కు లేకపోతే సామాన్య ప్రజలు పీజీఆర్ఎస్‌లో ఇచ్చిన ఫిర్యాదుల పట్ల కూటమి ప్రభుత్వంలో ఏవిధంగా న్యాయం జరుగుతుందోనన్న సందేహాలు ప్రజల్లో కలుగుతున్నాయి.



సుందరకోటలో గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని స్పీకర్‌ను కోరుతున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి (ఫైల్)

గిరి రైతులకు పట్టాలు.. పట్టించుకోని అధికారులు

మన్యంవాసులు ఎదుర్కొంటున్న కష్టాలు ఎప్పటికీ తీరడం లేదు. ఫిబ్రవరిలో కలెక్టర్ విజయ కృష్ణన్ సుందరకోట పంచాయతీ శివారు కొత్త దద్దుగుల గ్రామంలో గల గ్యాప్ ఏరియా భూముల పరిశీలనకు వచ్చారు. అప్పుడు స్థానిక గిరిజన పెద్దగా ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి గ్యాప్ ఏరియా భూములను ఏళ్ల తరబడి గిరిజనులు సాగు చేసుకుని **జీవనం సాగిస్తున్నారని, వారందరికీ పట్టాలు ఇవ్వాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అలాగే సంక్షేమ పథకాలు తీసుకోవడానికి ఆన్‌లైన్ సమస్య ఉందని, సెల్ టవర్లు కొండలపై గ్రామాల్లో ఏర్పాటు** చేయాలని కోరారు. అయితే ఇప్పటి వరకూ గిరిజనుల సమస్యలపై ఎటువంటి చర్యలు చేపట్టలేదు.

స్పీకర్ దృష్టికి తీసుకెళ్లినా మోక్షం లేదు

గత ఏడాది డిసెంబరు 24న సుందరకోట గ్రామానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు వచ్చారు. అక్కడ నిర్వహించిన సభలో ఆయన దృష్టికి ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి గిరిజన సమస్యలు తీసుకెళ్లారు. గత ప్రభుత్వంలో సరుగుడు, సుందరకోట **పంచాయతీల శివారులోని 16 గిరిజన గ్రామాల్లో పోడు భూమి వ్యవసాయం చేసుకునే 550 మందికి అప్పటి ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో పట్టాలు పాసుపుస్తకాలు పంపిణీ చేశామని, అర్హత ఉన్న మరో 250 మంది గిరిజనులకు పట్టాలు** తయారు చేసినా ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయాయన్నారు. వాటితోపాటు ఇంకా అర్హత ఉన్న గిరిజనులు సాగు చేసే భూముల గురించి సర్వే చేసి పట్టాలు ఇవ్వాలని స్పీకర్‌ను కోరారు. అయితే నెలలు గడిచినా ఇంతవరకూ ఒక్కరికైనా పట్టాలు ఇవ్వలేదు. వైఎస్సార్‌సీపీ హయంలో పట్టాలు పొందిన గిరిజనులందరూ రైతు భరోసా ఆర్థిక సాయం పొందారు.

భయపడుతున్న గిరిజన ప్రజాప్రతినిధులు

గతంలో గిరిజన ప్రాంతంలో నిబంధనలు ఉల్లంఘించి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా రాజకీయాలకు అతీతంగా గిరిజనులు ఏకమై ఆందోళన చేసేవారు. ఇపుడు కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు చూసి ఏమి చేస్తారోనన్న భయంతో గిరిజన ప్రజాప్రతినిధులు ముందుకు రావడం లేదు. కళ్ల ముందే కోట్లాది రూపాయల విలువ చేసే ప్రకృతి సంపద తరలించుకుపోతున్నా ఏం చేయలేని పరిస్థితి ఉందని గిరిజన ప్రజాప్రతినిధులు అంటున్నారు. దేనికైనా నా కాలమే సమాధానం చెబుతుందంటూ మిన్నకుండిపోతున్నారు. వామపక్షాలు, స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజనులు, ఇలా ఎంతమంది ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పీకర్ ఇలాకాలో జరుగుతుంది కాబట్టి అధికారులు పట్టించుకోలేదని బహిరంగంగా అంటున్నారు.

కన్జర్వేటివ్ రక్షిత ప్రాంతంగా

కొండకర్ల ఆవ

కలెక్టర్ విజయ కృష్ణన్ వెల్లడి

తుమ్మపాల: అచ్యుతాపురం మండలం కొండకర్ల ఆవను వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1972 కింద ప్రభుత్వం కన్జర్వేటివ్ రిజర్వ్‌గా ప్రకటించిందని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. కలెక్టరేట్‌లో అటవీ, పంచాయతీ, ఇరిగేషన్, ఫిషరీస్, టూరిజం శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కొండకర్ల ఆవను సర్వే చేసి సరిహద్దులు నిర్ణయించాలని, ఆవ గట్లు పటిష్టం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మురుగునీరు ఆవలో కలవకుండా చర్యలు చేపట్టాలన్నారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు చెత్తను ఆవలో వేయకుండా నియంత్రించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. రిసార్ట్స్ నిర్మాణం, రీక్రియేషన్, బోటింగ్ వంటి పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వం, టూరిజం భూమి ఎంత ఉందనేది నిర్ణయించాలని పర్యాటక శాఖాధికారులను ఆదేశించారు. జెట్టీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి, ఇన్‌చార్జి టూరిజం అధికారి ఎస్‌డీసీ కె.మనోరమ, జిల్లా మత్స్య శాఖ అధికారి ప్రసాద్, అటవీ శాఖ అధికారులు ఎం.శామ్యూల్, జి.లక్ష్మణ్, సునీల్ కుమార్, జ్యోతిర్మయి, ఇరిగేషన్ అధికారులు వి.బాల, సూర్యం, సాయి, ప్రశాంతి పాల్గొన్నారు.

ప్రమాద స్థాయిలో పెద్దేరు

మాడుగుల: అత్యంత జలవనరులు గల పెద్దేరు జలాశయం కేచ్‌మెంట్ ఏరియాలో గత వారం రోజులుగా వర్షాలు కురవడంతో రిజర్వాయర్‌లో ప్రస్తుతం 200 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో జలాశయం నీటిమట్టం పెరుగుతూ వస్తోంది. జలాశయం గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం 135.90 మిల్లీమీటర్లకు చేరుకుంది. ఇదే ఇన్‌ఫ్లో కొనసాగితే జలాశయం గేట్లు ఎత్తవలసి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పెద్దేరు ఆయకట్టు భూములకు ఢోకా లేదని రైతులు దీమా వ్యక్తం చేస్తున్నారు.

ఈసారైనా సక్రమంగా జరిగేనా?

కౌన్సెలింగ్ ద్వారా పంచాయతీరాజ్ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ

మహారాణిపేట: పంచాయతీరాజ్‌లో ఈసారైన పారదర్శక బదిలీలు జరిగేనా అన్న అనుమానం కలుగుతోంది. అయితే గత బదిలీల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో, ఈసారి కౌన్సెలింగ్ ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలు చేపట్టాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. గతంలో ఇంజినీర్లు, మినిస్టీరియల్ ఉద్యోగుల బదిలీలు ఏకపక్షంగా జరిగాయని విమర్శలు వచ్చాయి. ఈసారి నిబంధనలు చేస్తే అందరికీ న్యాయం జరుగుతుందని భావిస్తున్నారు.

28లోగా దరఖాస్తులు చేసుకోవాలి

బదిలీల కోసం దరఖాస్తు గడువు ఈనెల 28వ తేదీగా నిర్ణయించారు. దరఖాస్తులను జిల్లా పంచాయతీ అధికారులకు సమర్పించాలి. డీపీవోలు 29న నోడల్ అధికారికి వాటిని పంపిస్తారు. వచ్చే నెల 2వ తేదీలోగా కౌన్సెలింగ్ , పోస్టింగ్‌ల ప్రక్రియ పూర్తి చేయనున్నారు.

సిఫార్సు లేఖల కోసం హడావుడి

పోస్టింగ్ కోసం ఇంజినీర్లు, ఎంపీడీవోలు, సిబ్బంది సిఫార్సు లేఖల కోసం ప్రయత్నిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేల నుంచి సిఫార్సు పొందడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. తమకు నచ్చిన పోస్టు కోసం పైరవీలు కూడా చేస్తున్నారు.

ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు..

అల్లూరి సీతారామరాజు జిల్లాలో రెండేళ్లు పనిచేసిన ఉద్యోగులను ఏజెన్సీ ప్రాంతాల నుంచి మైదాన ప్రాంతాలకు బదిలీ చేయనున్నారు. అలాగే, ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా ఏజెన్సీలో పనిచేయాలనే నిబంధన కూడా ఉంది. ఎక్కువ కాలం ఏజెన్సీలో పనిచేస్తున్న వారిని మైదాన ప్రాంతాలకు బదిలీ చేయనున్నారు.

సొంత డివిజన్‌లో 'నో'

పంచాయతీరాజ్‌లో సొంత డివిజన్ లేదా సొంత మండలంలో పనిచేయడానికి నిబంధనలు అడ్డు వస్తున్నాయి. అలాగే 9 సంవత్సరాలు ఒకే స్థలంలో పనిచేసిన ఉద్యోగ సంఘాల నాయకులను బదిలీ చేయకూడదు.

యోగాతో ఆరోగ్యం, ఆనందం



యోగాసనం వేసిన కలెక్టర్ విజయ కృష్ణన్



ముత్యాలమ్మపాలెం తీరంలో యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న అభ్యాసకులు

పరవాడ: సాగరతీరంలో ఆనంద'యోగ'ం.. అభ్యాసకుల ఆసనాలతో ముచ్చటైన దృశ్యం.. ప్రముఖ పర్యాటక కేంద్రమైన ముత్యాలమ్మపాలెం తీరంలో మంగళవారం కలెక్టర్ విజయ కృష్ణన్ ఆధ్వర్యంలో వెయ్యి మంది యోగాసనాలు వేశారు. వచ్చే నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నెల రోజులపాటు నిర్వహిస్తున్న యోగాంధ్రలో భాగంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందని, యోగాను ప్రతి ఒక్కరు దినచర్యగా చేసుకోవాలని పిలుపు నిచ్చారు. జిల్లాలో 25 మంది యోగా గురువులు, 100 మంది మాస్టర్ ట్రైనీలతో 4,500 మంది సచివాలయ సిబ్బందికి యోగాసనాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పొందిన సచివాలయ సిబ్బంది ప్రతి గ్రామానికి వెళ్లి, రోజుకు 50 మందికి చొప్పున ఐదు రోజుల పాటు క్రమం తప్పకుండా రోజుకో యోగాసనం వేసేలా శిక్షణ ఇస్తారన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె.లావణ్య, జిల్లా పర్యాటక శాఖ అధికారి కె.మనోరమ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి అనిత, మండల ప్రత్యేకాధికారి సరోజిని, సర్పంచ్ చింతకాయల సుజాత, ఎంపీడీవో బి.రమేష్‌నాయుడు, తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సాగుకు సిద్ధమేనా?

- 'నైరుతి' ప్రభావంతో తొందరగా వచ్చిన వర్షాలు
- ఇంకా దుక్కులు చేపట్టని రైతులు
- మరోవైపు పెట్టుబడి సాయం అందలేదనే బెంగ




సాక్షి, అనకాపల్లి: నైరుతి రుతుపవనాలు ముందుగా రావడంతో మే నెలలోనే వర్షాలు మొదలయ్యాయి. ఖరీఫ్ సీజన్‌కు ఈ వర్షాలు శుభ సూచనలే అయినా రైతులు మాత్రం ఆందోళన చెందుతున్నారు. ఈ సీజన్‌లో జిల్లాలో వరి ఎక్కువగా సాగు చేస్తారు. సకాలంలో వరుణుడు కరుణిస్తే ఏటా జూన్ ఆరంభం నుంచే దుక్కులు చేపట్టి భూములను సిద్ధం చేసుకుంటారు. ఒకవైపు వర్షాలు ఊరిస్తున్నా.. రైతులు సాగుకు ముందుకు సాగలేకపోతున్నారు. ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందకపోవడం.. కీలకమైన సమయంలో వరుణుడు ముఖం చాటేస్తే పరిస్థితి ఏమిటన్న సందిగ్ధం వారిని డైలమాలో పడేశాయి. ప్రభుత్వ సహకారం లేకపోవడంతో అప్పు చేసుకుని ముందడుగు వేస్తే గతేడాది లాగే నష్టపోయే పరిస్థితి నెలకొంటుందా..? అనే అనుమానంతో రైతన్న దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నాడు. 'అన్నదాత సుఖీభవ' సాయాన్ని గతేడాదిలా ఈసారి కూడా ఎగ్గొడతారన్న భయం వారిని వెంటాడుతోంది.

జూన్ 15 నుంచి అనువైన సమయం

ఖరీఫ్‌లో పంటలు విత్తుకునేందుకు జూన్ 15 నుంచి జూలై ఆఖరు వరకు అనువైన సమయమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈసారి చాలా మండలాల్లో ముందస్తుగా భారీ వర్షాలు కురిశాయి. ఇంకా వర్ష సూచన ఉందని చెబుతున్నారు. నైరుతి రుతుపవనాలు ముందే ప్రవేశించాయి. ఈ ఏడాది ఖరీఫ్ సాగు లక్ష్యం 1.50 లక్షల ఎకరాలు కాగా..వీటిలో 1.30 ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. ఇప్పటికే 24,112 క్వింటాళ్ల విత్తనాలను సిద్ధం చేశామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. 23,109 వరి విత్తనాలు, 893 పచ్చి రొట్ట విత్తనాలు, 111 అపరాలు సిద్ధంగా ఉన్నాయి. ఈ విత్తనాలు అగ్రిల్యాబ్‌కు విత్తన శుద్ధికి పంపించినట్లు జేడీ వెల్లడించారు. వర్షాన్ని రైతులు వినియోగించుకుని భూమిని దున్ని, ఖరీఫ్ పైరులైన సజ్జ, కొర్ర, అపరాలు, వేరుశనగ వంటి పంటలను వేసుకోవాలని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు చెప్పారు.


సాయం లేకపోతే వ్యవసాయం చేయలేం..



రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా వ్యవసాయ రంగం కుదేలవుతుంది. 2004కు ముందు చంద్రబాబు పాలనలో కరువు కోరల్లో చిక్కుకున్న రైతన్నకు రాజన్న అండగా నిలిచారు. 2019–24లో ఆర్‌బీకేల ద్వారా జగనన్న విస్తృత సేవలందించి రైతు బాంధవుడిగా పేరుపొందారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది రైతులు అప్పుల ఊబిలోకి వెళ్లిపోయారు. ఈ ఏడాది ఎలా ఉంటుందో అని భయపడుతున్నారు. ఈసారి కూడా పెట్టుబడి సాయం ఇవ్వకపోతే రైతు వ్యవసాయం చేయడం మానేస్తాడు.

– పోతల సత్తిబాబు, రైతు, ఆక్సాపేట గ్రామం, కోటవురట్ల మండలం

ముందస్తు వర్షాలతో చెరకుకు లాభం



ప్రస్తుతం పడుతున్న ముందస్తు నైరుతి ప్రభావ వర్షాలు చెరకు పంటకు మంచిది. కానీ వరి సాగుకు అనువైనది కాదు. ఇప్పటికే దుక్కులు దున్నుకుని ఉంటే వరి సాగుకు మేలు జరిగేది. అయితే రైతు ఇంకా సన్నద్ధమవ్వలేదు. జిల్లాలో 10 శాతం కూడా దుక్కులు అవ్వలేదు. ఇప్పటివరకూ వరి నాట్లయితే ఎవరూ వేయలేదు. జూలై 15 తరువాతే ఖరీఫ్ సీజన్‌కు రైతులు వరి నాట్లు వేస్తారు. గతేడాది ఖరీఫ్ సాగులో వరి పంట ఆలస్యంగా వేశారు. వర్షాలు తగ్గితే రైతులు దుక్కులు దున్నుకుంటే మంచిది. నేలలో వర్షపు నీరు ఇంకి వరి సాగుకు మేలు జరుగుతుంది.

– జగన్నాథరావు, ఆర్ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త

జూలో సీడ్ బాల్స్ తయారీ


ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో జూ, గ్రీన్ క్లైమేట్ సంస్థ సంయుక్తంగా మంగళవారం సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమం నిర్వహించాయి. ఎన్‌సీసీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సీడ్ బాల్స్ తయారు చేసి జూలోని వివిధ ప్రాంతాల్లో చల్లారు. జూ క్యూరేటర్ మంగమ్మ మాట్లాడుతూ విత్తన బంతులతో సామాజిక వనాలు పెంచడం అభినందనీయమన్నారు. ఏపీ ఎన్‌సీసీ పదమూడో బెటాలియన్ ఎల్.టి కల్నల్ నీరజ్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక వనాల పెంపులో అందరి భాగస్వామ్యం అవసరమని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్ణిం, సుభేదార్లు మేజర్ శ్రీనివాస్, సుహాస్‌సింగ్, సునీల్‌సింగ్ రవీంద్రసింగ్, సుహాస్ సింగ్, జూ అధికారులు, సిబ్బంది, గ్రీన్ క్లైమేట్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



సీడ్‌బాల్స్‌తో ఎన్‌సీసీ విద్యార్థులు, జూ సిబ్బంది, ఎన్జీవో సంస్థ ప్రతినిధులు

31 వరకు చిన్నారులకు టీకాలు

రావికమతం: జిల్లాలో ఈనెల 31వ తేదీ వరకు చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం జరుగుతుందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ చెప్పారు. రావికమతం పీహెచ్‌సీని మంగళవారం ఆయన సందర్శించారు. పీహెచ్‌సీలో తిరిగి రోగులతో మాట్లాడారు. పిల్లల వ్యాక్సిన్ నిల్వలు, రిఫ్రిజిరేటర్, రక్త పరీక్షలు చేసే ల్యాబ్‌ను పరిశీలించారు. రికార్డులు, రిపోర్టులను తనిఖీ చేశారు. మీజిల్స్ రుబెల్లా టీకా స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి రామచంద్రరావు, అరుణాచలం, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ నళిని పుష్ప, సీహెచ్‌వో హేమ సుందరరావు, సూపర్ వైజర్ సత్యనారాయణ, ఏఎన్ఎం రమణమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



రావికమతం పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

అంధకారంలో 5 గ్రామాలు 8లో

భూ వివాదంలో ఘర్షణ

ఒకరికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న కొండలరావు

బుచ్చెయ్యపేట: మండలంలో శివారు గ్రామం మల్లాం భూపతిపాలెం(ఎంబీపాలెం)లో భూమి గట్టు వివాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇతని పరిస్థితి విషమంగా ఉండగా అనకాపల్లి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎంబీపాలేనికి చెందిన కలం చంటమ్మ, మహాలక్ష్మిల భూములు పక్క పక్కనే ఉన్నాయి. వీరిద్దరూ భూముల గట్టు విషయమై పలుమార్లు గొడవలకు దిగారు. మంగళవారం మహాలక్ష్మి కుటుంబ సభ్యులు పొలం గట్టు వేస్తుండగా చంటమ్మ అల్లుడు అప్పాన కొండలరావు అడ్డుకున్నాడు. దీంతో ఇరువురు మధ్య గొడవ జరిగింది. ఈ దాడిలో కొండలరావు తలపై తీవ్ర గాయమై రక్తస్రావంతో స్పృహ తప్పి పడిపోయాడు. కుటుంబ సభ్యులు అతడిని అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు కుట్లు వేసి వైద్య సేవలందిస్తున్నారు. దీనిపై పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

లైంగిక వేధింపులపై మహిళ ఫిర్యాదు

సబ్బవరం: కోరిక తీర్చమని వేధిస్తున్న వ్యక్తిపై ఓ మహిళ సబ్బవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాలు.. మండలంలోని అంతకాపల్లి శివారు ఒమ్ముపానిపాలేనికి చెందిన వివాహిత పిల్లల హేమలత గర్భవతి కావడంతో 6 నెలల క్రితం రాయపుర అగ్రహారంలోని తన పుట్టింటికి వచ్చింది. నెల క్రితం డెలివరీ అయింది. సోమవారం సాయంత్రం సమయంలో స్నానం చేసి ఇంట్లోకి వెళ్తుండగా.. ఇంటి సమీపంలో నివాసం ఉంటున్న పల్ల దేముడుబాబు అనే వ్యక్తి బలాత్కారం చేయబోయాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు చేరుకున్నారు. దీంతో దేముడుబాబు అక్కడి నుంచి జారుకున్నాడు. ఈ నేపథ్యంలో గ్రామంలో ఇరు వర్గాల మధ్య తీవ్ర వివాదం నెలకొంది. కుటుంబ సభ్యుల సహకారంతో సోమవారం రాత్రి బాధితురాలు హేమలత పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టి, కేసు నమోదు చేయనున్నట్లు సీఐ జి.రామచంద్రరావు తెలిపారు.

పిడుగుపాటుకు పాడిగేదె మృతి


మృతి చెందిన పాడి గేదె

రావికమతం : రావికమతంలో మంగళవారం సాయంత్రం పిడుగుపాటుకు పాడి గేదె మృతి చెందింది. కంఠంరెడ్డి నాయుడుకు చెందిన పాడిగేదె పాకలో ఉండగా సమీపంలో పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందింది. తన జీవనాధారం కోల్పోవడంతో నాయుడు కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

పిడుగుపడి పశువుల కాపరికి గాయాలు

నాతవరం : మండలంలో లింగంపేట పంచాయతీ శివారు బుచ్చెంపేట గ్రామానికి చెందిన బొడ్డు సూరిబాబు పిడుగుపాటుకు షాక్‌కు గురయ్యాడు. సూరిబాబు మంగళవారం పశువులను పొలంలోకి మేతకు తీసుకెళ్లాడు. భారీ వర్షం కురవడంతో సాయంత్రం పొద్దు పోయే సమయానికి ఇంటికి పశువులను తోలుకెళ్లడానికి సిద్ధపడుతున్నాడు. వర్షం తగ్గుముఖం పడుతుందని ఎదురుచూస్తుండగా సమీపంలో చెట్టుపై పిడుగుపడింది. ఈ పిడుగుపాటుకు సూరిబాబు షాక్ కొట్టి పడిపోయాడు. సమీపంలో ఉన్న స్థానికులు గుర్తించి సూరిబాబుకు సపర్యలు చేశారు. శరీరంపై తీవ్ర గాయాలు కావడంతో వెంటనే 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స అందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థి మృతి

పూడిమడకలో విషాద ఛాయలు


లోహిత్ కుమార్ (ఫైల్)

అచ్యుతాపురం రూరల్: గత నెల 23న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలైన సంతాడ లోహిత్‌కుమార్ మంగళవారం చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. ఈ ఘటనతో పూడిమడకలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇదే ప్రమాదంలో ఈరిగిల వివేక్ మృతి చెందడం పాఠకులకు విదితమే. ఇటీవల పదో తరగతిలో 565 మార్కులతో పాసైన విద్యార్థి లోహిత్‌కుమార్ రోడ్డు ప్రమాదానికి గురై మృత్యువాత పడటంతో అతడి కుటుంబం జీర్ణించుకోలేకపోతోంది. రూ.10 లక్షలపైన అప్పులు చేసి ఖర్చు పెట్టి నెల రోజులుగా ఆస్పత్రిలో వైద్యం చేయించినా ప్రాణాలు దక్కలేదు. దాంతో చేతికందొచ్చిన కొడుకు తిరిగిరాని లోకాలకు పోవడంతో అతడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

గుణుపూర్ పాసింజర్ వేళల్లో మార్పులు

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం–గుణుపూర్ పాసింజర్ వేళలు జూన్ 1వ తేదీ నుంచి మారుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. తెంబూరు–గుణుపూర్ మధ్య ప్రధానంగా రైళ్ల వేళలు మారాయి. విశాఖ–గుణుపూర్(58506) పాసింజర్ ప్రతీ రోజు ఉదయం 5.30 గంటలకు విశాఖలో బయల్దేరి ఉదయం 9.44 గంటలకు తెంబూరు, 9.49 గంటలకు గంగువాడ, 9.59 గంటలకు పాతపట్నం, 10.08 గంటలకు పర్లాకిముడి, 10.24 గంటలకు సీతాపురం, 10.29 గంటలకు హడ్డుబంగి, 10.39 గంటలకు కాశీనగర్, 10.49 గంటలకు లిహూరి, 10.59 గంటలకు బన్సదార, 11.09 గంటలకు పాలసింగి, 11.55 గంటలకు గుణుపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో గుణుపూర్–విశాఖపట్నం(58505) పాసింజర్ మధ్యాహ్నం 1.55 గంటలకు బదులుగా 2.30 గంటలకు గుణుపూర్‌లో బయల్దేరి 2.40 గంటలకు పాలసింగి, 2.47 గంటలకు బన్సదార, 2.56 గంటలకు లిహూరి, 3.04 గంటలకు కాశీనగర్, 3.15 గంటలకు హడ్డుబంగి, 3.20 గంటలకు సీతాపురం, 3.33 గంటలకు పర్లాకిముడి, 3.43 గంటలకు పాతపట్నం, 3.52 గంటలకు గంగువాడ, సాయంత్రం 4 గంటలకు తెంబూరు, 4.09 గంటలకు పెద్దసాన, 4.17 గంటలకు టెక్కలి, రాత్రి 9 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

అంధకారంలో 5 గ్రామాలు


పెదపూడికి వేసిన 24 గంటలు విద్యుత్ లైన్


పెదపూడి వద్ద మధ్యలో వైర్లు కలపకుండా వదిలేసిన స్తంభాలు

- కొత్త విద్యుత్ లైన్ వేసి పట్టించుకోని అధికారులు
- లక్షలు ఖర్చుపెట్టినా అందని 24 గంటల విద్యుత్
- వ్యక్తుల మధ్య విభేదాలతో పనుల నిలిపివేత
- ఏడాదిన్నరగా భర్తీ కాని లైన్‌మన్ పోస్టు


విద్యుత్ కోతలపై ఆగ్రహం చెందుతున్న ప్రజలు

బుచ్చెయ్యపేట: గ్రామస్థాయిలో ఒకరిద్దరి మధ్య తలెత్తిన వ్యక్తిగత విభేదాల వల్ల ఐదు గ్రామాలు అంధకారంలో మగ్గుతున్నాయి. నిరంతర విద్యుత్ వెలుగులు కోసం లక్షలు ఖర్చు పెట్టి కొత్తగా విద్యుత్ లైన్ వేస్తే, ఒకరిద్దరు అభ్యంతరాలతో వైర్లు వేయకుండా అధికారులు వెళ్లిపోయారు. పర్యవసానంగా ఆర్నెల్లుగా ఆయా గ్రామాల ప్రజలు చీకట్లో మగ్గిపోతున్నారు. బుచ్చెయ్యపేట మండలం ఎర్రవాయి శివారులో పెదపూడి, ఫంగిడి, చిన్నయ్యపాలెం, సూర్యలక్ష్మినగర్, ఉప్పరగూడెం గ్రామాలకు 24 గంటలు విద్యుత్ సరఫరాకు లైన్ ఏర్పాటు చేశారు. కొత్త లైన్ వేసి ఆరు నెలలైన నేటికీ విద్యుత్ లైన్ కలపకపోగా నిరంతర కరెంట్ అందడం లేదు. సీతయ్యపేట నుంచి పెదపూడి గ్రామం వరకు ఆర్అండ్‌బీ రోడ్డు పక్క నుంచి విద్యుత్ స్తంభాలు వేసి వైర్లు ఏర్పాటు చేశారు. పెదపూడి దగ్గరలో రెండు విద్యుత్ స్తంభాలను రోడ్డుకు అవతలికి మార్చు చేయాలని ఒకరిద్దరూ అడ్డుకున్నారు. రోడ్డుకు అవతల వైపు వందేళ్ల నాటి నీడనిచ్చే భారీ వృక్షాలు ఉండటంతో వాటిని నకరడం కుదరలేదు. రోడ్డుకు ఒకవైపు ఖాళీ ప్రదేశంలో స్తంభాలు వేయాలని గ్రామస్తులంతా రోడ్డు కాంట్రాక్టర్‌కు, విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఒకరిద్దరూ అడ్డుకున్నారన్న షాకుతో ఆరు నెలలుగా రెండు విద్యుత్ స్తంభాలు మధ్యన వైరు వేయకుండా కొత్త లైన్ కలపకుండా అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇటీవల ఏ మాత్రం గాలివాన కురిసిన గంటలు తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. కొండ ప్రదేశాల్లో ఉన్న ఈ గ్రామాలకు కరెంట్ పోవడంతో చీకట్లో విష పురుగుల బెడదతో భయభ్రాంతులకు గురవుతున్నారు. గతంలో ఇక్కడ పని చేసిన లైన్‌మన్ రవిని ఏడాదిన్నర క్రితం బదిలీ చేశారు. ఆ తర్వాత పీపీ అగ్రహారానికి చెందిన జేఎల్ఎంకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏడాది తర్వాత జేఎల్ఎం మారిపోవడంతో ఐదు గ్రామాలకు లైన్‌మన్ లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఐదు గ్రామాల్లో ఎక్కడ ఫ్యూజ్ కాలిపోయినా పరిష్కరించే దిక్కు లేదు. పంచాయతీ నుంచి డబ్బులిచ్చి ప్రైవేటు వ్యక్తితో విద్యుత్ మరమ్మతులు చేయిస్తున్నారు. లక్షలు ఖర్చు పెట్టి కొత్త లైన్ వేసినా సుమారు 800 కుటుంబాలకు నిరంతర విద్యుత్ సరఫరా అందడం లేదని ఎర్రవాయి గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే విద్యుత్, రెవెన్యూ, పోలీస్ అధికార్లు చొరవ చూపి ఐదు గ్రామాలకు 24 గంటల విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టి, అంధకారం తొలగించాలని కోరుతున్నారు.

తరచూ కరెంట్ కోతలు



లక్షలు ఖర్చు చేసి మా గ్రామాలకు కొత్త లైన్ ఏర్పాటు చేశారు. ఐదు గ్రామాలకు స్తంభాలు వేసి వైర్లు బిగించారు. ఇక కరెంట్ బాధలు తప్పాయని అనుకున్న మా గ్రామాలకు మాత్రం నిరంతర విద్యుత్ అందడం లేదు. తరుచూ కోతలతో కరెంట్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.
– **ఆలేటి రామకృష్ణ,** పెదపూడి, బుచ్చెయ్యపేట మండలం

నిరంతర విద్యుత్ అందించాలి



మా గ్రామాలకు 24 గంటలు కరెంట్ అందిస్తున్నారని తెలిసి మురిసిపోయాం. స్తంభాలు, వైర్లు వేసి నెలలు గడుస్తున్నా నిరంతర కరెంట్ అందడం లేదు. ఇటీవల పలుమార్లు రాత్రి, పగలు కరంట్ పోతోంది. గాలివర్షం వస్తే రాత్రిపూట చీకట్లో పాముల బెడదతో భయంగా గడుపుతున్నాం. అధికారులు మా గ్రామాలకు నిరంతర విద్యుత్ అందించాలి.
– **లాలం గంగాధర్,** ఫంగిడి, బుచ్చెయ్యపేట మండలం

ప్రైవేటు హెల్పర్‌తో విద్యుత్ పనులు



ఏడాదిన్నరగా లైన్‌మన్ పోస్టును భర్తీ చేయలేదు. ఏ మాత్రం గాలి వీచినా విద్యుత్ ఫ్యూజ్‌లు కాలిపోయి మా గ్రామాలకు సరఫరా ఉండటం లేదు. నెలకు రూ. 5 వేలు అందించి ప్రైవేటు హెల్పర్‌తో విద్యుత్ పనులు చేయించుకుంటున్నాం. కొత్త విద్యుత్ లైన్ ద్వారా నిరంతర కరెంట్ అందించాలని అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు.
– **గోకివాడ వరకృష్ణ,** సర్పంచ్, పెదపూడి, బుచ్చెయ్యపేట మండలం

ఆదర్శనీయమైన సమాజం వీహెచ్‌పీ ధ్యేయం


శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాయుడు, మాధురి, వెంకటేశ్వరరావు


శిక్షణలో పాల్గొన్న మహిళలు

అనకాపల్లి: నేటి యువత నైతిక, ధార్మిక విలువలతో నియమబద్ధమైన జీవితాన్ని గడపాలని, హిందూ ధర్మం పట్ల అవగాహన కలిగి ఉండాలని విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు డి.డి.నాయుడు తెలిపారు. జీవీఎంసీ విలీన గ్రామం సిరసపల్లి వద్ద చింతామణి గణపతి దత్తక్షేత్ర ఆవరణలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో 'దుర్గావాహిని' ప్రాంత శౌర్య ప్రశిక్షణా వర్గ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15 నుంచి 36 ఏళ్ల మహిళలకు వచ్చే నెల 2 వరకూ శిక్షణ ఇస్తారన్నారు. రాష్ట్రంలో 11 జిల్లాల నుంచి వీహెచ్‌పీ మహిళలు హాజరయ్యారన్నారు. గైనకాలజిస్టు మాధురి, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు వేంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశ వైభవం కోసం, ధర్మ పరిరక్షణ కోసం మన పూర్వీకులు ఎన్నెన్నో త్యాగాలు చేశారన్నారు. వారందరి దివ్య జీవితాలను మనం తెలుసుకుని నేటి సమాజంలో ఎదురవుతున్న సమస్యలను ఎదుర్కొంటూ ఆత్మవిశ్వాసంతో గౌరవనీయమైన జీవనం గడిపే విధంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. యువతి ద్వారానే ఆదర్శనీయమైన సమాజ నిర్మాణం చేయాలన్నదే వీహెచ్‌పీ ధ్యేయమన్నారు. రాష్ట్ర ప్రతినిధి శ్రీకాళహస్తి, రాష్ట్ర మహిళా ప్రముఖ్ టి.సునీతాదేవి, రాష్ట్ర దుర్గా వాహినీ సంయోజిక సి.హెచ్.శోభారాణి, జిల్లా కార్యదర్శి ప్రదీప్ శర్మ, జిల్లా సహ కార్యదర్శులు పూజ్యం నాగబాబు, బోడాల వేణు, జిల్లా ఉపాధ్యక్షుడు రామకొండలరావు, పట్టణ అధ్యక్షుడు నుదురుపాటి తాతాజీ, కార్యదర్శి సరిశా సింహాచలం, సహ కార్యదర్శులు రమేష్, పీలా హేమ జగదీష్ నాయుడు, ఆడారి రాజు పాల్గొన్నారు.

క్వారీ రోడ్డు కోసం కొండనే తొలిచేస్తున్నారు

బవులువాడ గ్రామస్తుల ఫిర్యాదుతో నిలిపివేసిన అధికారులు


బవులువాడ కొండపై రోడ్డును పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయకుమార్, ఎస్సై రవికుమార్

తుమ్మపాల: అనధికార మైనింగ్ రహదారిపై బవులువాడ గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ విజయకుమార్ రంగంలోకి దిగి పనులు నిలిపివేశారు. దీనిపై త్వరలో గ్రామసభ నిర్వహిస్తామని తెలిపారు. మండలంలో బవులువాడ రెవెన్యూ పరిధి రావుగోపాలరావు, జగనన్న కాలనీల వద్ద సర్వే నంబరు 70, 74, 75 కొండ మీదుగా నెల రోజులుగా చేపడుతున్న అనధికార మైనింగ్ రోడ్డును మంగళవారం ఆయన రూరల్ ఎస్సై రవికుమార్‌తో కలిసి పరిశీలించారు. కొండపై మూడు కిలోమీటర్ల మేర వేసిన రోడ్డు పనులు పరిశీలించి రావుగోపాలరావు కాలనీ వాసులతో మాట్లాడారు. కాలనీకి ఆనుకుని కొండపై రోడ్డు నిర్మించడం వల్ల కాలుష్యం పెరుగుదలతోపాటు బండరాళ్లు పడే అవకాశం ఉందని వాపోయారు. మార్టూరు రెవెన్యూ పరిధిలో నవీన్, రమణారెడ్డి క్వారీలకు తమ గ్రామం మీదుగా రాకపోకలు లేవని, కూటమి పార్టీ అండతో క్వారీ యాజమానులు దౌర్జన్యంగా కొండను తొలిచేస్తున్నారని ఫిర్యాదుదారులు కె.సత్తిబాబు, తదితరులు తెలిపారు. క్వారీ వాహనాల రాకపోకలకు గతంలో ఉన్న రోడ్డు వద్ద క్రమేణా నివాసాలు ఏర్పాటు కావడంతో ప్రత్యామ్నాయంగా కొండ మీదుగా రహదారి నిర్మాణానికి అంగీకారం తెలిపామని కొందరు కాలనీ వాసులు తెలిపారు. ఇరువర్గాల అభిప్రాయాలు తెలుసుకున్న తహసీల్దారు త్వరలో గ్రామసభ నిర్వహిస్తామన్నారు. అనధికారిక రోడ్డు పనులుపై చర్యలు తీసుకోవాలని, జేసీబీలను సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని ఫిర్యాదుదారులు కోరగా, ప్రస్తుతానికి పనులు నిలిపివేయాలని, వాహనాలను తరలించాలని క్వారీ యాజమానులకు సూచించి వెనుతిరిగారు. ఆర్ఐ రమేష్, వీఆర్వో రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పీఎఫ్ కార్యాలయ ఉద్యోగి మృతి


మృతుడు నరేష్ బాబు

గోపాలపట్నం: మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న పి.వి. నరేష్ బాబు (60) మంగళవారం సాయంత్రం ఎన్ఏడీ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఎయిర్‌పోర్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సాయంత్రం పీఎఫ్ కార్యాలయం నుంచి విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై పెందుర్తిలోని ఇంటికి వెళ్తుండగా ఓ కంటైనర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరేష్ బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. కంచరపాలెం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని కేజీహెచ్‌కు తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలను విచారించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎయిర్‌పోర్ట్ సీఐ ఉమామహేశ్వరరావు నేతృత్వంలో ఎస్ఐ ప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు.

లారీ డ్రైవర్‌కు జైలు, జరిమానా

విశాఖ లీగల్ : అతివేగంగా, నిర్లక్ష్యంగా లారీ నడిపి ఒక వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌కు రెండేళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ నగరంలోని ప్రధాన మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం. ప్రదీప్ కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా రెండు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు వల్లి నాగేశ్వరరావు లారీ డ్రైవర్. విశాఖలో ఉంటున్నాడు. మృతుడు కోరుకొండ అప్పలాచారి కూడా విశాఖకు చెందినవాడు. అప్పలాచారి వృత్తిరీత్యా వడ్రంగి పనిచేస్తుంటాడు. 2023 అక్టోబరు ఏడో తేదీన అప్పలాచారి విశాఖ నుంచి శ్రీకాకుళం పని మీద వెళ్లాడు. అక్కడ కార్పెంటర్ పని చేసి తిరిగి రాత్రి 9 గంటల సమయంలో నగరంలోని ఆదర్శనగర్ జంక్షన్ వద్ద సిగ్నల్ పడడంతో ఆగాడు. వెనుక నుంచి వస్తున్న లారీ ఆగకుండా అప్పలాచారి మోటార్ సైకిల్‌ను బలంగా ఢీ కొట్టి 200 మీటర్ల దూరం ఈడ్చుకుంటూ వెళ్లింది. వాహనం నడుపుతున్న అప్పలాచారి అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక ఉన్న వ్యక్తికి కూడా బలమైన గాయాలు తగిలాయి. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు ఆరిలోవ ఎస్ఐ బి. అరుణ్ కుమార్ కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు. పరిహారం కోసం నగరంలోని న్యాయ సేవా ప్రాధికార సంస్థను ఆశ్రయించాలని న్యాయమూర్తి తమ తీర్పులో సూచించారు.

చెక్ బౌన్స్ కేసులో రియల్ ఎస్టేట్ వ్యాపారికి జైలు

విశాఖ లీగల్ : చెక్ బౌన్స్ కేసులో రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ నగరంలోని ఏడో ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి జి.విశ్వనాథం మంగళవారం తీర్పు చెప్పారు. జైలు శిక్షతోపాటు ఫిర్యాదుదారుకు ఇవ్వవలసిన రూ. 42 లక్షలు, అలాగే రూ. 5వేలు ప్రభుత్వ ఖజానాకు చెల్లించాలని న్యాయమూర్తి తమ తీర్పులో స్పష్టం చేశారు. ఫిర్యాదుదారు తరపు న్యాయవాది ముళ్లపూడి కళ్యాణ చక్రవర్తి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరానికి చెందిన ప్రముఖ డాక్టర్ సుధాకర్ పట్నాయక్ భీమిలి సమీపంలోని భూమి కొనుగోలు చేయడానికి ప్రయత్నించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి వి. గుప్తేశ్వరరావు తన వద్ద భూమి ఉందని నమ్మబలికాడు. నవంబర్ 2022లో రూ. 42 లక్షలు..డాక్టర్ సుధాకర్ నుంచి తీసుకున్నాడు. నిందితుడు చాలాకాలం డబ్బులు ఇవ్వకుండా, లేని భూములు చూపిస్తూ డాక్టర్‌ను మోసం చేశాడు. భూమి లేదా తాను ఇచ్చిన డబ్బును తిరిగి ఇవ్వాలని డాక్టర్ సుధాకర్ కోరినప్పటికీ గుప్తేశ్వరరావు స్పందించలేదు. బాకీ తీర్చే నిమిత్తం గుప్తేశ్వరరావు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన రూ.42 లక్షల చెక్కును బాధితుడికి ఇచ్చాడు. ఆ చెక్కును బ్యాంకులో వేయగా, ఖాతాలో తగినంత డబ్బు లేని కారణంగా అది నిరాకరణకు గురైంది. నోటీసు జారీ చేసినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఫిర్యాదుదారు డాక్టర్ సుధాకర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

పబ్జిగేమ్ ఆడొద్దన్నందుకు పారిపోయిన విద్యార్థి

- కుటుంబ సభ్యులకు అప్పగించిన టూటౌన్ పోలీసులు


తల్లిదండ్రులకు విద్యార్థిని అప్పగిస్తున్న సీఐ ఎర్రంనాయుడు తదితరులు

అల్లిపురం: పబ్జీ గేమ్స్ ఆడవద్దని తండ్రి మందలించడంతో యువకుడు ఇంటి నుంచి పారిపోయి వచ్చాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు వెతికి పట్టుకుని వారికి అప్పగించారు. టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా ఉంగుటూరుకు చెందిన ఐటీఐ విద్యార్థి.. పబ్జీ గేమ్స్‌కు బానిస కావడంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన విద్యార్థి సోమవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న తండ్రి వెంప శివకుమార్ ఏలూరు పరిసర ప్రాంతాల్లో వెతికినా అతని ఆచూకీ తెలియరాలేదు. దీంతో నిడమర్రు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సదరు విద్యార్థి ఒక వ్యక్తి సెల్ నుంచి తాను హైదరాబాద్‌లో ఉన్నట్లు తండ్రి సెల్‌కు మెసేజ్ పెట్టాడు. ఆ ఫోన్ నంబరు ఆధారంగా నిడమర్రు పోలీసులు సాంకేతికత ద్వారా విద్యార్థి విశాఖలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో విశాఖ చేరుకున్న తల్లిదండ్రులు టూటౌన్ పోలీసులను సంప్రదించారు. ఎస్ఐ ఎన్. సింహాచలం, హెచ్‌సీ టీ. శ్రీనివాసరాజు సహకారంతో సదరు విద్యార్థి కల్లుపాకల వద్ద ఉన్నట్లు గుర్తించారు. అతడిని తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

క్లుప్తంగా

పిల్లల సంరక్షణ సెలవుల మంజూరుకు డిమాండ్



డిపో ఆవరణలో రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మికులు

అనకాపల్లి టౌన్: మహిళ ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు వెంటనే మంజూరు చేయాలని ఎన్ఎంయూఏ జోనల్ జాయింట్ కార్యదర్శి జి శంకర్రావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 88వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1-2019 సర్క్యులర్ అమలు చేయాలని, డిపోలో సర్క్యులర్‌కి విరుద్ధంగా అక్రమంగా సస్పెండ్ చేసి డిపోను మార్చిన ఉద్యోగులను యదావిధిగా పాత డిపోలోనే కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు ఏఎస్ రావు, పీవీఎస్ రావు, కేఆర్ లక్ష్మి, కేఈ రావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాలెంలో ఉచిత పశు వైద్య శిబిరం



పశువులను పరీక్షిస్తున్న దృశ్యం

కశింకోట: విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో మంగళవారం తాళ్లపాలెం పాల సంఘంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి రైతులకు చెందిన పశువులకు వైద్య సేవలందించారు. ఎదకు రాని పది పశువులకు, గర్భధారణ చేసినా నిలవని వాటికి చికిత్సలు అందించారు. సంఘం అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



యోగా కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం బాలబాలికలకు యోగా, రెజ్లింగ్ కుస్తీ, కబడ్డీ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు కేఎన్వీ సత్యనారాయణ, కాండ్రేగుల సురేష్, బుద్ద రాజేష్, విల్లూరు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 143 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,350	4,870
రెండో రకం	3,860	4,300
మూడో రకం	3,350	3,700

అనకాపల్లి సినిమాలు

నిశ్శబ్ద ప్రేమ : రాజా
శుభం : సత్యనారాయణస్క్రీన్-1
లవ్‌ : సత్యనారాయణ స్క్రీన్-2 (1, 2 షోలు)
సత్యనారాయణ స్క్రీన్-2 : శుభం, (ఉదయం, మధ్యాహ్నం)
హిట్-3 : పర్తిసాయి
సింగల్ : షిర్డీసాయి
ఏసీఈ : వెంకటేశ్వర
వర్షం : శ్రీసత్య
ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్ : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 38 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 12 యూనిట్లు, బీ పాజిటివ్ -11, ఓ పాజిటివ్ -11, ఏబీ పాజిటివ్ -4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్‌ను 9703619706 ఫోన్‌లో సంప్రదించాలని కోరారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 353 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 297 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

కాలనీల్లో సౌకర్యాలు నిల్



దుర్భర రోడ్లు, నీరు, విద్యుత్ కొరతతో దర్శనమిస్తున్న గురజాడ నగర్ రిక్షా కాలనీ

- కానరాని రోడ్లు, విద్యుత్, మంచినీటి సదుపాయం
- ముఠా కార్మికులకు తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని కూటమి పాలకులు

తుమ్మపాల: అనకాపల్లి చుట్టు పక్కల గ్రామాల్లో శివారు కాలనీలు ఏజెన్సీని తలపిస్తున్నాయి. కనీస మౌలిక వసతులు లేకపోవడంతో ముఠా కార్మికులు ఏళ్ల తరబడి దుర్భర జీవనం అనుభవిస్తున్నారు. ప్రభుత్వమిచ్చిన స్థలాల్లో అష్టకష్టాలు పడి గూడు నిర్మించుకున్నప్పటికి వాటికి తగ్గ సౌకర్యాలు లేక వదిలిపోవాల్సిన దుస్థితి ఉత్పన్నమవుతోంది. అనకాపల్లి పట్టణ పేదలకు గత ప్రభుత్వాలు సమీపల గ్రామాల్లోని కొండ ప్రాంతాల్లో స్థలాలు మంజూరు చేసింది. దీంతో ఒక్కొక్కరు అక్కడ సొంత గూడు నిర్మించుకుని పనుల నిమిత్తం పట్టణానికి వచ్చి వెళ్తూ రోజు వారి జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. వీరు ఆయా గ్రామాల్లో పాలకులు, అధికారుల దృష్టిలో ఇప్పటికీ వలస జీవులుగానే ఉండిపోయారు. దాంతో కాలనీల్లో మౌలిక సౌకర్యాలు కల్పించే ఆలోచనే చేయడం లేదు.

మండలంలో పట్టణానికి చెందిన వివిధ వర్గాలకు చెందిన నిరుపేదలకు బట్లపూడి, కొప్పాక, గొలగాం, తారకరామ కాలనీ, మారేడుపూడి, తుమ్మపాల, పిసినికాడ, మామిడిపాలెం, బవులువాడ, తదితర గ్రామాల్లో స్థలాలు ఇవ్వడంతో ఇళ్లు కట్టుకున్నారు. వీరంతా అక్కడ నివసిస్తున్నప్పటికి రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు వారివి. దీనికి తోడు కనీస సౌకర్యాలు కరవై వారు నిత్యం అవస్థలకు గురవుతున్నారు. రోడ్లు, డ్రైనేజీలు లేవు. గుక్కెడు నీటి కోసం నిత్యం దేవులాడుకోవలసిన పరిస్థితి. రాత్రయితే చాలు అంధకారంలో మగ్గిపోవలసిందే. చుట్టూ ఉన్న తుప్పల్లోంచి ఎప్పుడు ఏ విషపురుగు ఇళ్లలోకి ప్రవేశిస్తోందనన్న భయాందోళనతో ఆయా కాలనీ వాసులు జీవనం సాగిస్తున్నారు.



సౌకర్యాలు లేని ఇళ్లే అధికం

అనకాపల్లి పట్టణంలో వివిధ ప్రాంతాలకు చెందిన నిరుపేద రిక్షా, ముఠా, కలాసీ వగైరా కార్మికులకు మండలంలోని పలు పంచాయతీలో శివారు ప్రాంతాల కాలనీల్లో అరకొరగానే ఇళ్లు కట్టుకుని ఆయా వర్గాల వారు నివాసముంటున్నారు. పేదరికంతో కొందరు స్థలాలను విక్రయించుకోవడంతో నేటికి అవి ఖాళీగానే ఉన్నాయి. కాలనీలు ఉన్నప్పటికి పూర్తిస్థాయిలో నిర్మాణాలు లేకపోవడం అరకొరగా కట్టుకున్న వాటికి సౌకర్యాలు కల్పించడం కష్టతరంగా మారడంతో అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదు. కనీసం విద్యుత్, మంచినీరు అందించకపోవడంతో కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంచి నీరు కొనుక్కోవాలి....

ఆయా గ్రామాల్లో ఇలాంటి కాలనీల్లో నివాసముంటున్న వారంతా ప్రైవేటు మంచినీటి ప్లాంట్ వద్ద రోజువారి వాడకం, తాగేందుకు కూడా నీటిని కొనుగోలు చేసుకునే దుస్థితి. విద్యుత్ స్తంబాలు లేక విద్యుత్ సౌకర్యం లేదు. దింతో రాత్రి సమయాల్లో వారి వేదన వర్ణనాతీతంగా ఉంది. రాత్రులు ఈ కాలనీలకు రాకపోకలు చేయడం సహసంగానే ఉంటుంది. శివారు ప్రాంతాలు కావడంతో పాములు, పలు రకాల ప్రమాధాలకు కాలనీ వాసులు గురవుతున్నారు. కాలనీల చుట్టూ తుప్పలు ఎక్కువగా ఉండడంతో వేసవి రోజుల్లో మరిన్ని ఇబ్బందులు పడుతున్నాబని చెబుతున్నారు.

గుక్కెడు నీటి కోసం అవస్థలు..



గ్రామాల్లో అనేక కాలనీలో తాగునీటి కుళాయిలు లేవు. నీటి కోసం అర కిలోమీటరు దూరం వెళ్లి బిందెలు, డబ్బాలతో చేతిబోర్ల నుంచి తెచ్చుకోవల్సిందే. కొన్నిసార్లు డ్రమ్ములతో నీటిని కొనుగోలు చేసుకుంటున్నారు. ఎండాకాలంలో నానా అవస్థలు పడుతున్నారు. జలజీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో శివారు కాలనీలకు ఇంటింటికీ కుళాయి నీరు అందించాలి.

– కొణతాల హరినాథ్‌బాబు, అనకాపల్లి

ఒక్కో స్తంభానికి రూ.50 వేలు కట్టాలంట



ప్రభుత్వం స్థలాలిచ్చిన కాలనీలో కూలీ డబ్బులు దాచుకుని వ్యయప్రయాసలతో ఇల్లు కట్టుకున్నాను. విద్యుత్, మంచినీరు సౌకర్యం ఇప్పటికీ లేదు. ఇక్కడ కుటుంబంతో ఉండలేక మరో చోట నివాసం ఉంటున్నాం. విద్యుత్ సౌకర్యం కోసం ఆ శాఖ సిబ్బందిని కలిస్తే ఒక్కో స్తంభానికి రూ.50 వేలు ఎస్టిమేషన్ బిల్లు ఇచ్చారు. కాలనీ వాసులు చందాలు వేసుకుని చెల్లించడానికి సిద్ధమైతే, దూరం వల్ల రెండు స్తంభాలు వేయాల్సి ఉందని, రెండింటికి కలిపి రూ.లక్ష చెల్లించాలంటున్నారు.

– ఎస్.రాజు, గురజాడ నగర్, రిక్షా కాలనీ

యోగాతో ఆరోగ్యం



యోగాపై సచివాలయ సిబ్బందికి శిక్షణ

కశింకోట: ఆరోగ్యంగా ఉండటానికి యోగా దోహదపడుతుందని మండల ప్రత్యేక అధికారి సుభాషిణి తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంపై సచివాలయ సిబ్బందికి ఐదు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమం స్థానిక పీఏసీఎస్ వద్ద ఫంక్షన్ హాలులో మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో యోగాపై అవగాహన కలిగించుకొని, దాని ప్రయోజనాలను గ్రామాల్లో ప్రజలకు వివరించి చైతన్యవంతులను చేయాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ యోగాను ప్రతి ఒక్కరూ ఆచరించి ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఎంపీడీవో వి.వి. రవికుమార్, ఎంఈవో కె.ఎస్.ఎన్. మూర్తి, డిప్యూటీ ఎంపీడీవో ఎం. వెంకటలక్ష్మి, పీడీలు, పీఈటీలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు మోదమాంబ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



మోదమాంబ ఆలయం, అమ్మవారు

తుమ్మపాల: మండలంలో గొలగాం పంచాయతీ పాత తలారివానిపాలెంలో మోదమాంబ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యుడు నారపిన్ని నానాజి తెలిపారు. ఇక్కడ పురాతన ఆలయాన్ని పునర్నిర్మించిన నేపథ్యంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భక్తులు పాల్గొనేందుకు అన్ని ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 8.24 గంటల అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన , పసుపుకుంకుమలు, ధూపదీప నైవేద్యాలతో పూజలు జరుగుతాయన్నారు. 108 పళ్లాల సారె ఊరేగింపు, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, కోలాటం, సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉరుములు, మెరుపులతో వర్షం



అనకాపల్లిలో కురుస్తున్న వర్షం

కశింకోట: ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కశింకోటలో కురిసింది. రోడ్లు చిత్తడిగా మారాయి. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మండుటెండ తీవ్రంగా కాసింది. ప్రజలు ఎండ తీవ్రతతో సతమతమయ్యారు. అనంతరం ఆకాశంలో మేఘాలు కమ్ముకొని చిన్నగా వర్షం కురిసింది. వర్షానికి రోడ్లు చిత్తడిగా మారాయి. వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు.

అనకాపల్లి టౌన్: పట్టణంలోని మంగళవారం ఒక్కసారిగా కురిసిన వర్షంతో ప్రజలు సేదతీరారు. ఉదయం నుంచి భానుడు తన ప్రతాపం చూపడంతో ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. మధ్యాహ్నం నాలుగు గంటల సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. ఈ వర్షాలు ఖరీఫ్ పైరులైన సజ్జ, కొర్ర, అపరాలు, వేరుశనగ వంటి పంటలు వేసుకోవడానికి అనుకూలంగా ఉంటాయని వ్యవసాయాధికారులు తెలిపారు.

అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ

ఆక్రమణపై ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం



ఆశీలమెట్ట వద్ద పూడికపోయిన కాలువ

అనకాపల్లి: జీవీఎంసీ జోనల్ పరిధిలో ఉమ్మలాడ జంక్షన్ రహదారి ఆశీలమెట్ట జంక్షన్ వద్ద డ్రైనేజీ వ్యవస్థను జోనల్ అధికారులు అభివృద్ధి చేయకపోవడంతో అధ్వానంగా మారింది. 30 సంవత్సరాలుగా ఇక్కడ నివసిస్తున్న 150 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. దాంతో స్థానికులు నెల రోజులు క్రితం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారుల్లో చలనం లేకుండా పోయింది. ఉన్న కాలువలను కొంతమంది ఆక్రమించి గృహాలు నిర్మించడం వల్ల వాడుక నీరు పోయే మార్గం లేక దుర్వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులు పాడుతున్నారు. వర్షాలు పడుతున్న సమయంలో డ్రైనేజీ నీరు రోడ్డుపైకి చేరి వివిధ రకాల వ్యాధులు బారినపడే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డ్రైనేజీ వ్యవస్థను పునర్నిర్మించాలి



30 సంవత్సరాలుగా నివాసముంటున్నాం. డ్రైనేజీలో పిచ్చి మొక్కలు పెరిగిపోయి, విషసర్పాలకు నిలయంగా మారింది. రాత్రి సమయంలో రహదారిపై నడవాలంటే భయంభయంగా ఉంటోంది. ఇప్పటికి మూడు దఫాలుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. సమస్య పరిష్కరించలేదు. డ్రైనేజీలో పూడిక తీత పనులు తక్షణమే చేపట్టాలి. పెద్ద అపార్టుమెంట్లు వెలుస్తున్నాయి. ఇప్పటికే కొంతమేర డ్రైనేజీని ఆక్రమించారు. పూర్తిగా ఆక్రమణలకు గురికాకుండా అధికారులు డ్రైనేజీ వ్యవస్థను పునర్నిర్మించాలి.

– ఓం నమఃశివాయ, ఆశీలమెట్ట జంక్షన్

ఆర్చరీలో గణేష్ మణిరత్నం ప్రతిభ



గణేష్ మణిరత్నం

పరవాడ: మండలంలోని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్లో ఏర్పాటైన ఆర్చరీ అకాడమీలో శిక్షణ పొందిన టి.గణేష్‌మణిరత్నం పూనేలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ ట్రయల్స్‌లో అర్హత పొందినట్లు స్కూల్ ప్రతినిధులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో కెనడా, సింగపూర్‌లలో జరగనున్న యూత్ వరల్డ్ చాంపియన్‌షిప్, ఆసియన్ కప్ స్టేజ్-2 పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గణేష్‌మణిరత్నంను విశాఖ ఆర్చరీ సంఘ చైర్మన్ పి.సూర్యనారాయణరెడ్డి, కార్యదర్శి కె.నిశాంత్, కోశాధికారి పి.భాస్కర్ ప్రత్యేకంగా అభినందించారు. పోటీలకు గణేష్ మణిరత్నం ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని క్రీడావసరాల కోసం సంస్కృతి గ్లోబల్ స్కూల్ చైర్మన్ పి.సూర్యనారాయణరెడ్డి రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు.

సత్యసాయి ప్రేమ ప్రవాహిని ప్రేమ రథం ఊరేగింపు



సత్యసాయి ప్రేమ రథాన్ని, ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి టౌన్: భగవాన్ సత్యసాయి ప్రేమ ప్రవాహిని ప్రేమ రథం మంగళవారం రాత్రి పట్టణంలో ఊరేగించారు. పుటపర్తి నుంచి వచ్చిన ఈ రథం ఊరేగింపు గుండాల జంక్షన్ నుంచి ప్రారంభమై లక్ష్మీదేవి గేటు మీదుగా నెహ్రూచౌక్ జంక్షన్, మెయిన్‌రోడ్ గవరపాలెం సత్యసాయి మందిరానికి చేరుకుంది. అక్కడి నుంచి సుబ్రహ్మణ్యం కళ్యాణ మండపానికి చేరుకుంది. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్షణరావు మాట్లాడుతూ ప్రేమను పంచడమే సత్యసాయి భక్తి మార్గం అన్నారు. కార్యక్రమంలో సాయి భక్తులు గుంపిన రమేష్ గాప్తా, మోదినాయుడు, బెనర్జీ, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య పార్కును పునరుద్ధరించాలి



జోనల్ కమిషనర్ రమణకు వినతిపత్రం అందజేస్తున్న బల్లా నాగభూషణం

అనకాపల్లి: పట్టణ ప్రజల కోరిక మేరకు స్థానిక శారదానది ఒడ్డున అన్నమయ్య పార్కును పునరుద్ధరించాలని సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం కోరారు. స్థానిక జోనల్ కార్యాలయంలో జెడ్సీ బి.వి.రమణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ 2007లో ఆహ్లాదకరమైన పార్కును నిర్మించి, అన్నమాచార్యుల 21 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. అప్పట్లో ప్రారంభించిన ఈ పార్కును కొన్ని సంవత్సరాలుగా అభివృద్ధి చేయకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగిపోయి, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందన్నారు. వెంకటేశ్వర స్వామి భక్తుడు, వాగ్గేయకారుడు అన్నమాచార్యుల విగ్రహం పాడైపోతుందని వాపోయారు. వెంటనే పార్కును వినియోగంలోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి వినకోట నీలేష్ గుప్తా, ఉపాధ్యక్షుడు పట్నాల కృష్ణమోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ఊడా నాగేశ్వరరావు, ఏవీ రమణమూర్తి, పొట్టి శ్రీరాములు భవన వ్యవస్థాపక చైర్మన్ పిరాట్ల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ నోటిఫికేషన్ ఉపసంహరించుకోవాలి



నోటిఫికేషన్ రద్దు చేయాలంటూ నిరసన తెలుపుతున్న రైతులు

నక్కపల్లి: మండలంలో బల్క్ డ్రగ్ పార్క్ నిర్మాణం కోసం సీహెచ్ఎల్ పురంలో భూసేకరణ కోసం ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో రైతులు గ్రామంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీహెచ్ఎల్ పురం రెవెన్యూ పరిధిలో జానకయ్యపేటలో 98 మంది రైతులకు చెందిన 198 ఎకరాల భూమిని బల్క్ డ్రగ్ పార్క్ కోసం సేకరిస్తున్నట్లు ఇటీవల ప్రభుత్వం 4(1) నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. భూసేకరణ కోసం గ్రామంలో సర్వే చేసినప్పుడు, తహసీల్దార్ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించినప్పుడు తమ భూములు ఇచ్చే ప్రసక్తి లేదని స్పష్టం చేశామన్నారు. అయినా ప్రభుత్వం ఏకపక్షంగా రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కొనేందుకు నోటిఫికేషన్ విడుదల చేయడం దారుణమన్నారు. తక్షణం నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ ఆందోళనలో రైతులు దేవర సత్తిబాబు, కురందాసు అప్పలరాజు, మామిడి బాబ్జి, పంపన బోయిన తులసీరావు, చందక నానాజీ, దేవర అప్పలరాజు పాల్గొన్నారు.

50 శాతం రాయితీపై సమీకృత మిశ్రమ దాణా



తాళ్లపాలెంలో రైతులకు సమీకృత మిశ్రమ దాణా పంపిణీ

కశింకోట: పాడి రైతులకు వేసవిలో పశు గ్రాసం కొరత దృష్ట్యా ప్రభుత్వం 50 శాతం రాయితీపై సమీకృత మిశ్రమ దాణా అందిస్తుందని కన్నూరుపాలెం పశు వైద్యాధికారి దయానా తెలిపారు. మండలంలోని తాళ్లపాలెం పశు వైద్య కేంద్రం వద్ద రాయితీపై మిశ్రమ దాణాను కూటమి నాయకులతో కలిసి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 50 కిలోల మిశ్రమ దాణా రూ.1,116 కాగా, దాన్ని రూ.555కు రాయితీ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్, జనసేన పార్టీ నాయకులు కర్రి వెంకట సత్యనారాయణ, దొడ్డి నాగేశ్వరరావు, జూనియర్ వెటర్నరీ అసిస్టెంట్లు కరుణశ్రీ, సన్యాసిరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం సురేష్‌కుమార్

కశింకోట: విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథాలయానికి వెళ్లి పుస్తక పఠనం చేయడం మంచి అలవాటుగా చేసుకోవాలని, ఇది విజ్ఞానం పెంపొందడానికి దోహద పడుతుందని నరసింగబిల్లి పాఠశాల హెచ్‌ఎం సురేష్‌కుమార్ తెలిపారు. తాళ్లపాలెంలో శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో పుస్తకాలతోపాటు పత్రికలను పఠించాలన్నారు. ఈ సందర్భంగా రామాయణం, భాగవతంలోని శ్లోకాలను చదివి వినిపించి అర్థాలను వివరించారు. నీతి కథలు చదివి వినిపించారు. విద్యార్థులతో కథలను చదివించారు. అనంతరం యోగాసనాలు వేయించి వాటి వల్ల ఆరోగ్యం చేకూరడంతోపాటు మనస్సు ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. గ్రంథాలయ అధికారి కె. జగన్నాథం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అక్కిరెడ్డిపాలెం: టెక్ మహీంద్ర సహకారంతో కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్‌లో 18 నుంచి 30 ఏళ్ల లోపు వయసున్న డిగ్రీ, ఇంటర్ ఉత్తీర్ణులైన వారికి ఉచిత శిక్షణ అందించనున్నట్టు బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఈడీ సీహెచ్. నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. హెల్త్‌కేర్ బిల్లింగ్, జీడీఏ కోర్సుల్లో 3 నెలలు శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు డిప్లొమా పారామెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. వివరాలకు 7207953919, 7995013421 నంబర్లలో, షీలానగర్ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ ఆవరణలోని ఇన్‌స్టిట్యూట్‌లో సంప్రదించాలని కోరారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో ఉమ్మడి కుటుంబాలకు అన్యాయం

- మరోసారి సర్వే నిర్వహించాలి
- తహసీల్దార్‌కు వైఎస్సార్‌సీపీ నేతల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి

నక్కపల్లి: ఏపీఐఐసీకి భూములిచ్చిన నిర్వాసితుల్లో ఉమ్మడి కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో అన్యాయం జరిగిందని, దీన్ని సరిచేసి అందరికీ సమానంగా ప్యాకేజీ వర్తింపజేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన పలువురు నిర్వాసితులతో కలిసి తహసీల్దార్ నర్సింహమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజయ్యపేట, బోయపాడు గ్రామాల్లో పరిశ్రమల కోసం నివాస ప్రాంతాలను ఖాళీ చేయిస్తున్నారన్నారు. నిర్వాసితులను గుర్తించే సమయంలో కొంత మంది మత్స్యకారులు పొట్టకూటి కోసం ఇతర ప్రాంతాలకు తాత్కాలికంగా వలస వెళ్లారన్నారు. ఇలా వలస వెళ్లిన వారిలో చాలా మంది ఉమ్మడి కుటుంబాలకు చెందిన వారేనన్నారు. ఒకే ఇంట్లో ముగ్గురు, అంతకు మించి ఎక్కువ అన్నదమ్ములు, తండ్రులు, కొడుకులు, అక్కచెల్లెళ్లు నివసిస్తున్నారన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించేందుకు ప్రభుత్వం ఎన్యూమరేషన్ చేసే సమయంలో ఇంట్లో ఎవరు నివసిస్తే వారి పేర్లే నమోదు చేసుకుని వెళ్లారన్నారు. వలసపోయిన వారి ఇళ్లకు తాళాలు వేసి ఉండడం వల్ల వారి పేర్ల నమోదు చేయలేదన్నారు. ఇంటి మొత్తానికి ఒకే యజమాని పేరు నమోదు చేసుకుని వెళ్లడం వల్ల ప్రభుత్వం ప్రకటించిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి ఒక వ్యక్తే అర్హత సాధించాడన్నారు. ముగ్గురు అన్నదమ్ములు ఒకే ఇంట్లో నివశిస్తే ఎన్యూమరేషన్‌లో అధికారులు ఒక వ్యక్తి పేరు నమోదు చేయడం వల్ల మిగిలిన ఇద్దరూ నష్టపోతున్నారని చెప్పారు. ఇలా చాలా మంది ఉన్నారన్నారు. ప్రస్తుతం నివాస ప్రాంతాలను ఖాళీ చేయిస్తే వీరంతా రోడ్డున పడతారన్నారు. వీటిని సరిచేయాలని ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో బాధితులు అధికారులకు వినతి పత్రాలు అందిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇటువంటి వారి కోసం మరోసారి సర్వే చేయాలన్నారు. దీనిపై తహసీల్దార్ నర్సింహమూర్తి మాట్లాడుతూ సర్వే చేసిన సమయంలో ఎవరి పేరు నమోదయితే వారిపేరున మాత్రమే ప్యాకేజీ, నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. ఈ వ్యవహారం తన పరిధిలో లేదని, ఆర్డీవోకు కూడా వినతి పత్రం ఇస్తే వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలోనే ఆర్డీవోను కలిసి ఈ సమస్యను తెలియజేస్తామని శీరం నర్సింహమూర్తి చెప్పారు.